TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 187 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.01.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## మన లక్ష్యం జీరో రెబల్స్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 'జీరో రెబల్స్' లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కాంగ్రెస్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో రెబల్స్ బెడద పార్టీని తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల మున్సిపల్ ఎన్నికల్లో అలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. జీరో రెబల్స్ నినాదంతో ముందుకు పోవాలని సూచించారు. రెబల్స్‌ను బుజ్జగించి, ఒప్పించి, మెప్పించి వారితో నామినేషన్లను ఉపసంహరింపజేయాలని కోరారు. పార్లమెంటు నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా ఉన్న మంత్రులు ఈ బాధ్యతను భుజానికెత్తుకోవాలని మార్గదర్శనం చేశారు. జిల్లాల్లోని నేతల మధ్య విభేదాలను రెండు రోజుల్లో పరిష్కరించాలని సీఎం నొక్కి చెప్పారు. కనీసం 90 మున్సిపాల్టీల్లో పార్టీని గెలిపించి, కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు.

దాదాపు రెండు వారాలపాటు విదేశీ పర్యటనలో బిజీబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి... మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించారు. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకున్న ఆయన శనివారం అమెరికా నుంచి కాంగ్రెస్ నేతలతో జూమ్ మీటింగ్ నిర్వ హించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...ఎన్నికల ప్రచారం, ఎజెండా తదితరాంశాలపై చర్చించారు. పార్టీకి తలనొప్పిగా మారిన వర్గపోరు, ఆధిపత్య పోరును ఎలా అధిగమించాలనే అంశాలపై ఆయన నేతలతో సమాలోచనలు చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నుంచి క్షేత్రస్థాయి దాకా నేతలందరూ మంచి ఐక్యతను ప్రదర్శించారని, ఇప్పుడు కూడా అదే ఐక్యతను ప్రదర్శించటం ద్వారా మున్సిపోల్స్‌లో కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఇదే సమయంలో పార్టీ బలహీనంగా ఉన్నచోట గెలుపు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అవసరమైతే ఆయా మున్సిపాల్టీల్లో చేరికలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు ఈ బాధ్యతలను తీసుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకున్నప్పటికీ కొన్ని కీలక ప్రదేశాల్లో పార్టీ పట్టు కోల్పోయిందని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యంగా కొందరు ఎమ్మెల్యేల సొంత గ్రామాల్లో సైతం పార్టీ ఓడిపోవటం మైనస్ అయ్యిందని చెప్పుకొచ్చారు. ఈసారి అలాంటి పొరపాట్లు జరక్కుండా చూసుకోవాలని, నేతలందరూ అలర్ట్‌గా ఉండాలని హెచ్చరించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేందుకు టీమ్ వర్క్ చెయ్యాలని సీఎం నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని ప్రతిపక్షాలు ప్రచారం చేశాయని గుర్తు చేశారు. అలాంటి ఫేక్ సర్వేలు, ఫేక్ ప్రచారాలు చూసి నాయకులు ఆందోళన చెందొద్దని సూచించారు. ఆ ఉప ఎన్నికలో టీమ్ వర్క్ చేసి ఘన విజయం సాధించామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం అదే వ్యూహంతో ముందుకు వెళ్దామంటూ సీఎం సూచించారు.

రేపు హైదరాబాద్‌కు సీఎం.. 4వ తేదీ నుంచి ప్రచారం

ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈనెల 4వ తేదీ నుంచి ఆయన పూర్తిస్థాయిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 4న మిర్యాలగూడలో, 5న కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఆయన ఎలక్షన్ ప్రచారం నిర్వహిస్తారు. 6న నిజామాబాద్ రూరల్, 7న వికారాబాద్ జిల్లా పరిగి, 8న భూపాలపల్లిలో సీఎం ప్రచార సభలు నిర్వహించనున్నారు.

## సిట్‌కు నోటీసులిచ్చే అధికారమే లేదు

**నా రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారు**
**నోటీసులు గోడలకు అంటించడం చట్టవిరుద్ధం**
**ఎర్రవల్లి ఫాంహౌజ్‌లోనే విచారణ జరపాలి**
**అయినా నేడు 3 గంటలకు నందినగర్‌లో అందుబాటులో ఉంటా**
**బాధ్యతగల పౌరుడిగా దర్యాప్తునకు సహకరిస్తా : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) అధికారుల నోటీసులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) స్పందించారు. సిట్ అధికారులకు నోటీసులిచ్చే అధికారమే లేదనీ, అది తన రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని తెలిపారు. వారు వ్యవహరించిన తీరు చట్టాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ను సిట్ అధికారులు తుంగలో తొక్కారని అన్నారు. సిట్ అధికారుల నోటీసుకు కేసీఆర్ శనివారం బదులిచ్చారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. ఈ మేరకు కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. సిట్ అధికారులు రెండు సార్లు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధమనీ, చట్టాలను అతిక్రమించి ఇచ్చారని తెలిపారు. మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటం వల్ల వేరే రోజు విచారణ తేదీ ఇవ్వాలన్నానని గుర్తు చేశారు. 65 ఏండ్లుపైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 సీఆర్‌పీసీ నిబంధనలను ప్రస్తావించానని తెలిపారు.

తదుపరి నోటీసులన్నీ ఎర్రవల్లిలోని తన నివాసానికే పంపాలంటూ కోరానని పేర్కొన్నారు. ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు ఏసీపీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి తొమ్మిది గంటలకు నందినగర్ నివాసంలోని తమ ఇంటి గోడకు అతికించినట్టు తెలుస్తోందని తెలిపారు. ఆ లేఖ ఏసీపీ పంపినట్లయితే, వారి సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నానని పేర్కొన్నారు. ఇది భారత రాజ్యాంగం, చట్టం, సుప్రీంకోర్టుల పట్ల ఏమాత్రం గౌరవం లేదనే విషయాన్ని సూచిస్తుందని వివరించారు. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలను జారీ చేసిందని గుర్తు చేశారు. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదనీ, చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొందని తెలిపారు. సీఆర్‌పీసీ 160 నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలని కోరారు. కానీ కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఏసీపీ ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని వివరించారు.

ఎర్రవల్లికే నోటీసులు పంపాలని చెప్పినా.. విస్మరించిన అధికారులు

భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలంటూ చెప్పినప్పటికీ ఏసీపీ అధికారులు దాన్ని విస్మరించారని కేసీఆర్ తెలిపారు. రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదనీ, అది చెల్లబోదని స్పష్టం చేశారు. తాను ఏసీపీ పరిధి పోలీస్ స్టేషన్‌కుగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదని తెలిపారు. నోటీసు ఇచ్చే అధికారం, కట్టడి చేసే అధికారం లేదని వివరించారు. ఎన్నికల అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని చెప్పడం సరైంది కాదని పేర్కొన్నారు.

నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారన్నదే ముఖ్యమని వివరించారు. తాను కొన్నేండ్లుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నానని తెలిపారు. హరీశ్‌రావు అఫిడవిట్‌లో సిద్దిపేట అని చిరునామా ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు. ఇది సిట్ అధికారుల ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తున్నదని విమర్శిం చారు. తనకు ఇచ్చిన నోటీసు గోడకు అతికించడం చట్టవిరుద్ధమని తెలిపారు. చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నా మాజీ సీఎంగా, ప్రతిపక్ష నాయకుడిగా, బాధ్యత గల పౌరుడిగా దర్యాప్తునకు సహకరిస్తానని స్పష్టం చేశారు. తన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయాలని పట్టుబట్టినందున ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకి నందినగర్‌లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

## దేశం గ్రీన్ మొబిలిటీ దిశగా సాగుతోంది

అమృత్ తెలంగాణ: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు శనివారం కార్మిక అండ్ ఉపాధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సీఐ)లో తాజాగా ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) బ్యాటరీ సస్టైనబిలిటీ ఇంజినీరింగ్ కోర్సు గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని భారతదేశంలో తొలిసారిగా ప్రారంభించారని, ఎలక్ట్రిక్ మొబిలిటీ, సుస్థిరశక్తి రంగాల్లో పెరుగుతున్న నైపుణ్యాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సును స్టాఫ్‌లే రూపకల్పన చేశారని తెలిపారు. ఇందులో (ఈవీ) బ్యాటరీ సాంకేతికత, సస్టైనబిలిటీ పద్ధతులు, బ్యాటరీ జీవన చక్ర నిర్వహణ, రీసైక్లింగ్ విధానాలు, భద్రతా ప్రమాణాలు మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ప్రాయోగిక శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్ అంశాలు పొందుపరచబడ్డాయని అన్నారు. ఈ సందర్భంగా డా. జి.రామేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దేశం గ్రీన్ మొబిలిటీ దిశగా సాగుతున్న నేపథ్యంలో నైపుణ్యంతో కూడిన ఇంజినీర్లను తయారు చేయడం అత్యంత అవసరమని వివరించారు. ఈ కార్యక్రమం యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందిం చడంలో మరియు సుస్థిర అభివృద్ధికి తోడ్పడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్ భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు యువతకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

## మేడారంలో భారీగా ట్రాఫిక్ జామ్



వరంగల్ :అమృత్ తెలంగాణ: మేడారం మహాజాతర చివరి రెండ్రోజుల్లో గందరగోళం నెలకొంది. శుక్ర, శనివారాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో 6-8గంటల పాటు భక్తులు బస్సుల్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గురువారం, శుక్రవారం మేడారానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకపై పోలీసులు, ఆర్టీసీ అధికారులకు సరైన అంచనా లేకపోవడంతో తిరుగుప్రయాణానికి అవసరమైన బస్సులను అందుబాటులో లేకుండా పోయింది. శుక్రవారం వీవీఐపీల తాకిడి తారాస్థాయిలో ఉండటంతో ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్నా బస్సులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో ఉన్నతాధికారులు సైతం చేతులు ఎత్తేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి మేడారం-తాడ్వాయి మధ్య, తాడ్వాయి-పస్రా మధ్య భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో గంటలపాటు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

శుక్రవారం రాత్రి 7గంటలకు హనుమకొండ నుంచి మేడారం బయలుదేరిన భక్తులు శనివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు మేడారం చేరుకోకపోవడం గమనార్హం. హనుమకొండలో శుక్రవారం రాత్రి 7గంటలకు బస్సు ఎక్కితే మేడారం చేరేసరికి శనివారం ఉదయం 9గంటలు కావడం అంటే 14గంటలు పట్టడం విస్మయాన్ని కలిగిస్తోంది. శనివారం ఉదయం 4 గంటల అనంతరం ములుగు నుంచి మేడారం వెళ్లే బస్సులు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొన్నట్టు ఆర్టీసీ ప్రయాణీకులు తెలిపారు. మూడు, నాలుగు ప్రాంతాల్లో ఈ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుండటంతో తాడ్వాయి నుంచి మేడారానికి వెళ్లే భక్తులకు, మేడారం నుంచి బయటకు వచ్చే భక్తులకు కష్టంగా మారింది. ఆర్టీసీ అధికారులు మేడారానికి వయా తాడ్వాయి మీదుగా బస్సులకు వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేసినా, వీవీఐపీల వాహనాలు సైతం ఇదే రూట్‌లో వెళ్లడం కూడా ట్రాఫిక్ రద్దీకి కారణమైంది. తాడ్వాయి-మేడారం రహదారి మధ్యలో 7-8 వంకలుంటాయి. ఈ వంకల వద్ద బస్సులు నెమ్మదించడంతోనే వెనుక వాహనాలన్నీ నిలిచిపోయాయి.

డ్రోన్‌లు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ ఉన్నా ట్రాఫిక్ జామ్

మేడారం జాతరలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, డ్రోన్‌లు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీతో మేడారం గద్దెలతో పాటు పరిసర ప్రాంతాలు, రహదారుల్లో ట్రాఫిక్ రద్దీని ఎప్పటికప్పుడు అధిగమిస్తామని ప్రకటించిన పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం సాయంత్రం నుంచి చేతులు ఎత్తేయడం చర్చనీయాంశంగా మారింది. ఆధునిక ఏర్పాట్లన్నీ బాగానే ఉన్నా, ట్రాఫిక్ సమస్యలు ఏయే ప్రాంతాల్లో ఉత్పన్నమయ్యాయో అక్కడికి వెళ్లి తనిఖీలు చేయడానికి పోలీసులకూ కష్టతరమైంది.

వీవీఐపీ పాసుల వాహనాలతోనే రద్దీ..

మేడారం జాతరకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు, అధికారులకు భారీగా వీవీఐపీల పాసులు పంపిణీ చేయడం ట్రాఫిక్ రద్దీకి కారణంగా పలువురు ప్రయాణీకులు చెబుతున్నారు. వీవీఐపీల పాసులతో వచ్చిన వారు ఆర్టీసీ బస్సుల రూట్‌లోనే రావడం, ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తూ బస్సులకు అడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని ప్రత్యక్ష సాక్షి త్రిపురనేని సుబ్రహ్మణ్యం 'నవతెలంగాణ'కు తెలిపారు.

సరిపోను బస్సులు లేక ఇబ్బందులు

మేడారంలో 50ఎకరాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి బస్సులు లేక మేడారం నుంచి బయటకు రావడానికి వేచి ఉన్న భక్తులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. 4వేల బస్సులను ఏర్పాటు చేశామని ప్రకటించిన ఆర్టీసీ అధికారులు గురువారం

రాత్రి సమ్మక్క తల్లి గద్దెలపైకి కొలువుతీరగానే భక్తులు పెద్ద మొత్తంలో తిరుగుపయనమవుతారు. ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి బస్సులను పెంచాల్సిన అధికారులు పెంచకపోవడంతో బస్సులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## పనులు చూడండి..కబుర్లు నమ్మకండి..!



ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం రూరల్.అమృత్ తెలంగాణ: "ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి సొల్లు కబుర్లు చెబుతారు.. మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ, పదేండ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?" అని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారని, ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమీషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కండ్లముందే కూలిపోతోందన్నారు. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేతల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాట నిలబెట్టుకున్నామని మంత్రి పొంగులేటి అన్నారు. మాటలు చెప్పేవాళ్లం కాదని, పనిచేసే వాళ్లమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టామని, అర్హులైన ప్రతి పేదవాడికీ ఇండ్ల స్థలంతోపాటు రూ. 5 లక్షల సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

వర్షాకాలం నాటికి మున్నేరు గోడ నిర్మాణం పూర్తి

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తామన్నారు. ఎఫ్‌సీఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

నేడు మంత్రి కొండా సురేఖ సమావేశం

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి కొండా సురేఖ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఉన్న ఆమె మంత్రి పొంగులేటి లేకుండా ఆయన నియోజకవర్గంలోని సన్నాహక సమావేశానికి హాజరవుతుండటం గమనార్హం.

# ఘనంగా 'రోడ్డు భద్రతా 2కే రన్'






అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమ,నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా పట్టణంలో ' 2కే రన్' నిర్వహించారు. ఈ పరుగు స్థానిక ఆర్.టి.ఓ. కార్యాలయం నుండి ప్రారంభమై ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డు భద్రతా నినాదాలతో చేపట్టిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ... రోడ్డు నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు లక్షల మంది రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని, విద్యార్థులు, యువత, ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, విద్యార్థులు తమ తల్లితండ్రులకు, బంధుమిత్రులకు రహదారి భద్రత అవగాహన కల్పించాలని సూచించారు. నెల రోజుల పాటు రవాణా శాఖ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ అధికారులను అభినందించారు. తదుపరి 2కే రన్‌లో విజేతలకు, అతిథులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉప రవాణా కమిషనర్ రవీందర్ కుమార్, డివైఎస్ఓ శ్రీనివాస్ గారు, జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా రవాణా అధికారి ఎస్.శ్రీనివాస్, విద్యార్థులు, యువత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల మొదటి విడత రాండమైజేషన్ పూర్తి.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యవేక్షణలో పకడ్బందీగా సాగిన రాండమైజేషన్ ప్రక్రియ.

నిర్మల్ జిల్లా జనవరి 31 అమృత్ తెలంగాణ నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, శనివారం రాత్రి మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు మొదటి విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు ఈ రాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. రాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది పీఓ, ఎపిఓ, ఓపిఓ లను నియమించామని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సరిపడినంత మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరానికి అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు. దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత తలెత్తకుండా ఉంటుందని తెలిపారు ఈ రాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఈఓ భోజన్న, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికలపై అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్

# నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వార్డుల వారీగా ఏర్పాటు చేసిన స్క్రూటినీ (నామినేషన్ల పరిశీలన) కేంద్రాలను సందర్శించి, సౌకర్యాలను, భద్రతా ఏర్పాట్లపై ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల అర్హతలు, సమర్పించిన పత్రాలను నిశితంగా తనిఖీ చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద సిబ్బందికి కావాల్సిన ఎన్నికల మౌలిక వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వార్డుల వారీగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో స్క్రూటినీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, ఎన్నికల విభాగం సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి దృష్ట్యా ప్రజావాణి రద్దు జిల్లా కలెక్టర్ రాజార్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజార్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపివేస్తామని, కోడ్ ముగిసిన వెంటనే యథావిధిగా తిరిగి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# పట్టణంలోని భాగ్యనగర్ వార్డులో శనివారం "పౌర హక్కుల దినోత్సవం"




సమావేశంలో మాట్లాడుతున్న శశికాంత్



హాజరైన ప్రజలు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి పట్టణంలోని భాగ్యనగర్ వార్డులో శనివారం "పౌర హక్కుల దినోత్సవం" నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అయిండ్ల శశికాంత్, మల్లేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిమ్న వర్గాల ప్రజలు తమ హక్కులు, సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చదువు, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమస్యలను వెల్లడించేందుకు వెనుకాడవద్దని తెలిపారు. అనంతరం రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు యెజ్వేందర్, శశికళ, నాయకులు సిడాం రామకిష్టు, గంగాదేవి, ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి రానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో అకడమిక్ రివ్యూ, పరీక్షల సన్నాహక సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని, వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో, వెనుకబడిన విద్యార్థుల అభ్యున్నతి కోసం విద్యాశాఖ రూపొందించిన 25 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ను అమలు చేయాలన్నారురు. గత పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థులను వర్గీకరించి, వారికి కనీస అభ్యాస సామగ్రిని అందిస్తూ 'గన్ షాట్' ప్రశ్నలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వలన్నారు ప్రతిరోజూ సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించడంతో పాటు, ఫైనల్ పరీక్షా వాతావరణాన్ని ప్రతిబింబించేలా మూడు పూర్తి స్థాయి గ్రాండ్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల లోపాలను సరిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడి, ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యేలా కళాశాలల్లో కౌన్సెలింగ్ సెషన్లు, ప్రేరణాత్మక తరగతులు నిర్వహించాలని వివరించారు.

విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జె. గణేష్ కుమార్, సంక్షేమ శాఖల అధికారులు రాజలింగం, సునీత, కలీం, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలీలకు ప్రాముఖ్యత ఇవ్వాలి

## పద్మశాలీ సేవా సంఘం జగిత్యాల పట్టణ అధ్యక్షుడు బోగ గంగాధర్

జగిత్యాల అమృత్ తెలంగాణ జనవరి 31: మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలీలకు ప్రాముఖ్యత ఇచ్చి జనాబా ప్రాతిపధికన వార్డు స్థానాలు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పద్మశాలీ సేవా సంఘం జగిత్యాల పట్టణ అధ్యక్షుడు బోగ గంగాధర్ (జిఆర్) శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జగిత్యాల పట్టణంలో 32 వార్డులు ఉన్నప్పుడు 6 వార్డులు, 38 వార్డులు ఉన్నప్పుడు 13 వార్డులు పద్మశాలీలకు కేటాయించారన్నారు. అదేవిధంగా జగిత్యాల పట్టణంలో ప్రస్తుతం 50 వార్డులు ఉన్నాయని, పట్టణంలో అత్యధిక జనాబా కలిగిన కులాల్లో రెండవ స్థానంలో ఉన్న పద్మశాలీలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డు స్థానాలు పద్మశాలీలకు కేటాయించేలా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి పద్మశాలీలకు న్యాయం చేయాలని కోరారు.



# వారం రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



హౌసింగ్ అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన హౌసింగ్ అధికారులు

నిర్మల్ జిల్లా జనవరి 31 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వారం రోజుల్లోపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు మంజూరైన గృహాల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఎంపికైన లబ్ధిదారులు వెంటనే పునాది పనులు మొదలుపెట్టేలా క్షేత్రస్థాయి అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇండ్ల నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పనులు పూర్తయిన దశల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పరితగతిన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ పిడి రాజేశ్వర్,

ఆయా మండల ప్రత్యేక అధికారులు శంకర్, బాలిక్ అహ్మద్, శ్రీనివాస్, రాజ నర్సయ్య, మండల హౌసింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సొంతగూటికి చేరిన యాట విజయలక్ష్మి

ఆలేరు టౌను :అమృత్ తెలంగాణ: ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీకి చెందిన, జిల్లా మహిళ సెక్రటరీ యాట విజయలక్ష్మి, మాజీ ప్రభుత్వ విప్పు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సమక్షంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ సొంతగూటికి చేరారు. పార్టీ కండువా కప్పి మాజీ ఎమ్మెల్యే సునీత ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్చార్జ్ పసుల ప్రభాకర్ రెడ్డి, మేకల శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పస్పురి శంకరయ్య, మాజీ ఎంపీపీ క్యాస గల్ల అనసూయ, కొలుపుల హరినాథ్, మాదని ఫిలిప్స్, ఆడెపు బాలస్వామి, మొరిగాడి వెంకటేష్, గ్యాదపాక నాగరాజు, కుండే సంపత్ కుమార్, బింగి రవి, బింగి లత, యాట శివ, మొర్తల సునీత రమణారెడ్డి, మొరిగాడి మాధవి వెంకటేష్, మోతే కనకమ్మ వెంకటేష్ , చింత కింది రేణుక, రాయపురం శ్రీనివాస్, చెక్కిళ్ళ రవీందర్, ఐలి కృష్ణ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలీ

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు




రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ అధికారి వీడియో కాన్ఫరెన్స్




వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో జిల్లా అధికారులు

నిర్మల్ జిల్లా జనవరి 31 అమృత్ తెలంగాణ కలెక్టర్ అభిలాష అభినవ్, శనివారం సాయంత్రం, కలెక్టరేట్ లోని వీసీ హాలు నుంచి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. 2002 వివరాలతో, ప్రస్తుత వివరాలు సరి పోల్చి మ్యాపింగ్ ప్రక్రియను తర్వాతగతిన పూర్తి చేయాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ లు) తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. బిఎల్ఓ లు రోజువారీగా చేపట్టి ప్రోజెని మ్యాపింగ్ వివరాలను తమకు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. బిఎల్ఓ లకు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎబిఎల్ఓ లు సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా పోలింగ్ బూత్ లలో ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత బూత్ లకు చెందిన బిఎల్ఓ లు అందరూ సమన్వయం చేసుకుంటే ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. నిర్ణిత గడువులోగా

ఈ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో షీ టీమ్--భరోసా విస్తృత అవగాహన కార్యక్రమాలు

## నిర్మల్ ఉత్సవాల్లో ప్రశాంత వాతావరణం -- షీ టీమ్ అప్రమత్తమైన విధులు

## పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

## మహిళలు, బాలికల రక్షణే ప్రధాన లక్ష్యం -- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశానుసారం,షీటీమ్,భరోసా సిబ్బంది జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రజల మధ్య రోజంతా విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన నిర్మల్ ఉత్సవాల సందర్భంగా ఎక్కడా కూడా ఈవ్ టీజింగ్, ఆకతాయిల వేధింపులు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షీ టీమ్--భరోసా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించి శాంతిభద్రతలను సమర్థవంతంగా కాపాడారు. అదేవిధంగా, పట్టణంలోని వాసవి స్కూల్ పరిసరాల్లో రెండు--మూడు రోజులుగా కొంతమంది మైనర్లు స్కూల్ ముగిసే సమయంలో అక్కడే చక్కర్లు కొడుతున్నారన్న సమాచారాన్ని స్కూల్ హెడ్‌మాస్టర్ తెలియజేయగా, భరోసా సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి పహారా నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు మైనర్లు కావడంతో ఈరోజు భరోసా సెంటర్‌కు పిలిపించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే భరోసా-- షీ టీమ్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ వడ్యాల్ , కనకాపూర్ పాఠశాలల్లో విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకి భరోసా సెంటర్ అందించే సేవల వివరాలు, పోక్సో చట్టం, నేరాలకు విధించే శిక్షలు,కొన్ని కేస్ స్టడీస్ ద్వారా అవగాహన సోషల్ మీడియా లాభాలు, నష్టాలు, విద్య యొక్క ప్రాముఖ్యత,గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ ఇలా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా డయల్ 100, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతను గురించి కూడా క్లుప్తంగా వివరించడం జరిగింది. మహిళలు, బాలికలు, విద్యార్థుల భద్రతే లక్ష్యంగా జిల్లాలో షీ టీమ్ మరియు భరోసా సిబ్బంది నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, చట్టపరమైన రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.

# జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు,కార్యకర్తల సమావేశం

## రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షులు,ఎమ్మెల్సీ బలుమూరి వెంకట్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.





జగిత్యాల అమృత్ తెలంగాణ జనవరి 31 జిల్లా కేంద్రంలో మోతే రోడ్డు పార్టీ కార్యాలయం లో జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు,ముక్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని దిశానిర్దేశం చేసిన తెలంగాణ రాష్ట్ర ౹ాజజ ఉపాధ్యక్షులు,ఎమ్మెల్సీ బలుమూరి వెంకట్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గట్టు సతీష్ మాజీ లైబ్రరీ ఛైర్మెన్ డా.చంద్ర శేఖర్ గౌడ్ మాజీ ాపీజ ఛైర్మెన్ కొలుగురి దామోదర్ రావు, సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్,బాలే శంకర్,క్యాదసు నాగయ్యా,చెట్పల్లి సుధాకర్,అబ్దుల్ ఖాదర్ ముజాహిద్,పట్టణ ముఖ్య నాయకులు,యూత్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందించిన జీపీ కార్మికులు



బల్మూరు :అమృత్ తెలంగాణ: దశాబ్ద కాలం పాటు పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడానికి తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల రోజు ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలు చేయడని వారు తీవ్రంగా వ్యతిరేకించారు ఉన్న చట్టాలు యధావిధిగా ఉంచాలని నాలుగు లేబర్ కోడు రద్దు ఏవరకు కార్మికుల పక్షాన కార్మిక సంఘం పెద్ద ఎత్తున ఉద్యమాలు పోరాటాలు చేస్తదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు హెచ్చరించారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల పని చేస్తున్న కార్మికులు అచ్చంపేట పట్టణంలో నిరసన ర్యాలీ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు శంకర్, నిరంజన్ కృష్ణ శీను పర్వతాలు బొందయ్య వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# స్క్రూటీని పరిశీలించి న మున్సిపల్ కమిషనర్.







మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 31: మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన వాటిని 'స్క్రూటినీ' అనగా 'నామినేషన్ల పరిశీలన జరగటాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీ టీ మోహన్ పరిశీలించారు కమిషనర్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలు చట్టబద్ధంగా సరిగ్గా ఉన్నాయో లేదో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్ఓ ఈ ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ అనిల్ కుమార్,సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ముజీబ్ పాల్గొన్నారు.

# ఎర్రోళ్ల వంశీ యాదవ్ మృతి కి సంతాపంగా మాల విరమణ చేసిన కోమి రెడ్డి విజయ్ .



మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 31: వంశీ యాదవ్ కు నివాళిగా మాల విసర్జన ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు.. నిన్నటి వరకు మన మధ్య తిరిగిన వంశీ యాదవ్ నేడు మన మధ్య లేకపోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది. మెట్పల్లి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్రోళ్ల హనుమాన్లు- నర్సక్కల ఏకైక కుమారుడు వంశీ యాదవ్ మృతి కొమిరెడ్డి కుటుంబాన్ని తీవ్రంగా కలిచి వేసింది. వ్యక్తిగతంగా వారి కుటుంబంతో స్వర్గీయ కొమిరెడ్డి రాములు జ్యోతక్కల కు సుదీర్ఘ అనుబంధం ఉన్నది. కాగా మాలాధారణ చేసి శివ దీక్షలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్ ఆజాద్.. ఆయన మృతితో కష్టకాలంలో వారికి అండగా ఉండడానికి నిర్ణయించుకున్నారు. శనివారం మాలవిసర్జన చేసి దీక్ష విరమించారు.

జాతస్యం -మరణం- ధ్రువం మాలధారణ చేసి దీక్షలో ఉన్న ఏ భక్తుడైన కుటుంబంలో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు లేదా అత్యంత సన్నిహితులు మరణించినప్పుడు మాల విరమణ చేసి బాధిత కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన మానవ ధర్మం అంటూ హైందవ ధర్మం ఘోషిస్తుంది. దానిని తూ.చా తప్పకుండా అమలు చేసి విజయ్ ఆజాద్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

# ఏకలవ్యలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



వెల్దండ :అమృత్ తెలంగాణ: మండలంలోని గుండాలలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో సీబీఎస్సీకి అనుబంధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ అయిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో దరఖాస్తు చేయదలచిన వారు షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వర్గానికి చెంది ప్రస్తుతం 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులనీ అభ్యర్థులు 31 మార్చి 2013 నుంచి 31 మార్చి 2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. దివ్యాంగులైన పిల్లలకు రెండు సంవత్సరాల వయో సడలింపు ఉంటుందని, వారి తల్లితండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలుగా, గ్రామీణ ప్రాంతాలలో 1. 5 లక్ష లకు మించకూడదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 2026 వరకులో అప్లై చేసుకోవాలని తెలిపారు. 6వ,తరగతిలో మొత్తం 60 సీట్లు ఉంటాయి. వీటిలో 30 సీట్లు బాలురకు, 30 సీట్లు బాలికలకు కేటాయించబడ్డాయని తెలియజేశారు. ఇందులో ఎస్టీ విద్యార్థిని,విద్యార్థులకు 90% సీట్లు కేటాయించబడతాయని అన్నారు.

# తరగతి గది నుండే నవభారత నిర్మాణం




ఆలేరు :అమృత్ తెలంగాణ: తరగతి గదినుండే నవభారత నిర్మాణం ప్రారంభమవుతుందని, శ్రీ రామకృష్ణ విద్యాలయ ప్రధానాచార్య బండిరాజుల శంకర్ అన్నారు. ఆలేరు పట్టణంలో శనివారం పాఠశాలలో 'స్వపరిపాలన దినోత్సవం' ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే పాఠశాలల పాత్ర కీలకమని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. తల్లిదండ్రుల తరువాత ఆ పిల్లల క్షేమాన్ని, ఉజ్వల భవిష్యత్తును కోరుకునేది విద్యాబుద్ధులను నేర్పే గురువు మాత్రమే. అందుకే గురువుకు అంతటి ఉత్కృష్టమైన స్థానాన్ని ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ ఉత్సవంలో వివిధ పదవులు చేపట్టిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా తరిగొప్పుల సాయి చంద్, ఎం.పి గా అమిత్ శ్రీ వాత్సవ్, ఎం.ఎల్.ఏగా గోరంట్ల అక్షయ్, డిఇఓగా పంజాల వైష్ణవి ,డిప్యూటి డిఇఓ గా సూదగాని కీర్తన, ఎంఇఓ పేరబోయిన ప్రణయ్, ప్రిన్సిపాల్ గా లోచారపు సంజన, వైస్ ప్రిన్సిపాల్ గా తోట శివ,కలెక్టర్ గా కాంసాని జశ్వంత్, డాక్టరుగా బడే ప్రణతి, ఉపాధ్యాయులుగా ముస్కె బాలశ్రీదేవి, నాలోజు శ్రీలక్ష్మి, చింతకిందిసాయి లహరి, రాసమల్ల రోష్మిక, పత్తి వైశాలి, బుడిగె పూజ, మధు , మనోజ్, వేణుగోపాల్, సాయిరాఘవేంద్ర, అజయ్ , సామ్యూల్ తదితరులు తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తరిగొప్పుల రమేశ్, ఆచార్యులు జూకంటి సిద్ధులు, నారగోని భీమేశ్, బొడ్డు రమేశ్, గుగ్గిళ్ళ జయమ్మ,మాడిశెట్టివాణిశ్రీ, కడారి పరమేశ్వరి, కాయితి అన్నపూర్ణ, అంబాల ప్రసన్నలక్ష్మి, అప్పాల స్వరూప, మైలబోయిన పావని, ఆత్మకూరి దీపిక, యెనగందుల కవిత, వంగపల్లి శ్వేత, పిడిశెట్టి భవాని, వేముల భవాని, ఎం.మౌనిక, కొండ స్వాతి, సిరికొండ పద్మలత, యెలగందుల మమత పాల్గొన్నారు.

# మిస్సింగ్ కేసు నమోదు



రామనోళ్ళ హనుమాన్లు ఫైల్ ఫోటో

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జనవరి 31 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన రామనోళ్ళ హనుమశీడ్లు, 34 కల్లూరు లో ఎరువుల ఫెర్టిలైజర్ షాపు .ఉన్నందున ప్రతిరోజు తన సొంత గ్రామం కుస్లీ నుండి కల్లూరు షాప్ కు వెళ్తుంటాడు శనివారం ఉదయం8 గంటలకు షాప్ కు కల్లూరికి వెళ్ళినాడు కానీ సాయంత్రమైనా ఇంటికి రాకపోయేసరికి తన ఆచూకీ గురించి చుట్టుపక్కల వెతికిన కనబడటం లేదని తన భార్య రమణల్ల సవితారాణి పోలీస్ స్టేషన్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి దృష్ట్యా ప్రజావాణి రద్దు

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా జనవరి 31 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపివేస్తామని, కోడ్ ముగిసిన వెంటనే యథావిధిగా తిరిగి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# హత్యాయత్నం చేసిన భర్త కుటుంబ సభ్యులపై కేసు

జన్నారం :అమృత్ తెలంగాణ: భార్యపై హత్యాయత్నం చేసిన భర్త, కుటుంబ సభ్యులపై శనివారం కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్ ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. ఆమె తెలిపిన వివ రాల ప్రకారం జన్నారం గ్రామానికి చెందిన రుబీనా తబ్ రోజ్ ను అదే గ్రామానికి చెందిన అబ్దుల్ జుబేరుతో 26 నవంబర్ 2021న పెద్దల సమక్షంలో 4 తులాల బంగారం, రూ.1.5 లక్షల నగదు,హోండా షైన్, ఫర్నిచర్ ఇచ్చి వివాహం చేశామని తెలిపారు. ఆ తర్వా త పెండ్లైన 15 రోజుల నుండి ఆమెను అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టడాని ఈ నెల 29న ఆమెను నానాబూతులు తిడుతూ, సెల్ ఫో నుతో తలపై కొట్టి, వైరుతో మెడ చుట్టూ గట్టిగా చుట్టి హత్యాయత్నంను పాల్పడ్డారని ఆమె అన్న అంజన్ ఖాన్ ఇచ్చిన పిర్యాదు మేరకు ఆమె భర్త అబ్దుల్ జుబేర్,అత్త నూర్జాన్, ఆడపడుచు సహన పై హత్యాయత్నం కేసు నమోదు చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కుభీర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని గోడపూర్ గ్రామానికి చెందిన సిందే పూజ28వేలు సిందే ప్రసాద్ రూ.15వేలు ముఖ్యమంత్రి సహాయ నిది కి దరఖాస్తు చేసుకోవడంతో శనివారం స్థానిక సర్పంచ్ మొరే పల్లవి దత్తహరి పటేల్ బాధితు లకు చెక్క్ లను పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. గ్రామమంలో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలుపక్కాగా అందేలా చూస్తామని అన్నారు. అదే విదంగా గ్రామ అభివృద్ధికి తను ఎల్లవేళలా కృషి చేస్తానని సూచించారు.

రానున్న వేసవి కాలంలో ప్రజలకు మంచి నీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో మొరే దిగంబర్ పటేల్ అబాజీ పటేల్ రోహిదాస్ పుండ్లిక్ ప్రవీణ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం: సర్పంచ్



కుభీర్ :అమృత్ తెలంగాణ: గ్రామంలో ఉన్న ప్రతి యువకులు చదువులతో పాటు క్రీడాల్లో నైపుణ్యత సాధించేందుకు తోడ్పాడుతాయని స్థానిక సర్పంచ్ జాదవ్ రంగారావు అన్నారు. శనివారం మండలంలోని రంజిని గ్రామంలో మహాలక్ష్మి జాతర సందర్బంగా కుస్తీ పోటీలు నిర్వహించడం. ఈ పోటీలుగ్రామ విడిసి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోటీలో పాల్గొనేందుకు మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మహారాష్ట్ర నుంచే అధిక సంఖ్యలో మల్లాయోధులు హాజరయ్యారు. పోటీలను తిలకించేందుకు చుట్టూ ప్రక్కల ప్రజలు హాజరై కేరింతాలు కొడుతూ మల్లాయోధులకు ఉత్సవ పరిచారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 5501రెండో బహుమతి 3501నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కవిత బాయి బన్సీలాల్ రంగారావు మాజీ సర్పంచులు ఎంపీటీసీ లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ రిటర్న్ కార్మికులకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలి

జన్నారం : బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలు వెళ్లి రిటర్న్ వచ్చి గ్రామాల్లో నివసిస్తున్న గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని, మండలంలోని కామన్పల్లి గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జనూరి నాగరాజు అధ్యక్షులు జాడి కిరణ్ అన్నారు. శనివారం గల్ఫ్ సంక్షేమ సమితి ఆరవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, కామన్ పెల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న గల్ఫ్ సంక్షేమ సమితి జెండాను ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కార్మికుల సంక్షేమ సమితి కార్మికుల ఐక్యత కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ దేశాలలో గల్ఫ్ కార్మికులు పడుతున్న కష్టాలు ఇబ్బందుల గురించి గుర్తు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం గల్ఫ్ లో ఉన్న కార్మికులకు అండగా ఉండాలని, అలాగే (గల్ఫ్ రిటర్న్ ) స్థానికంగా ఉన్న గల్ఫ్ కార్మికులకు ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు.గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ నష్టపోయిన గల్ఫ్ కార్మిక కుటుంబానికి అందజేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వంగాల శేఖర్, ప్రధాన కార్యదర్శి చాట్ల తిరుపతి, కార్యదర్శి జునుగురు పాల్గొన్నారు.

# కెల్విన్ క్లైయిన్ ఇన్నర్‌తో రెచ్చిపోయిన బ్యూటీ



కపూర్ గాళ్స్ అనగానే సోనమ్ కపూర్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ అంటూ కొందరు గుర్తుకు వస్తారు కపూర్ గాళ్స్ అనగానే సోనమ్ కపూర్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ అంటూ కొందరు గుర్తుకు వస్తారు. కానీ బాలీవుడ్ లో కపూర్‌ల కుటుంబంతో సంబంధం లేకుండానే మరో కపూర్ గాళ్ నటిగా రాణిస్తోంది. ఫ్యాషన్ అండ్ మోడలింగ్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన ఈ బ్యూటీ భవిష్యత్ లో పెద్ద స్టార్ అవ్వాలని కలలు గంటోంది. ఇక ఆకాంక్ష సోషల్ మీడియా పోస్టులకు భారీ ఫాలోయింగ్ ఉంది. ఆకాంక్ష రంజన్ కపూర్ బాలీవుడ్ లో అప్ కమింగ్ స్టార్. గిల్టీ (2020) చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఈ బ్యూటీ ఆరంగేట్రమే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల నామినేషన్‌ను అందుకుంది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ రే (2021)తో ఓటీటీ రంగంలోకి ప్రవేశించింది. ఆకాంక్ష తండ్రి శశి రంజన్ అనుష్క రంజన్ అనే అక్క ఉంది. తను కూడా నటి. జమ్నాబాయి నర్సీ స్కూల్ నుండి పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, ఆకాన్షా విస్లింగ్ వుడ్స్ నుండి యాక్టింగ్ డిప్లొమాను అభ్యసించింది. .సింగిల్ గానా? ఆకాంక్ష కపూర్ తన కెరీర్‌ను 2019లో టెలివిజన్ ఫ్యాషన్ సిరీస్ డీకోడెడ్‌తో ప్రారంభించింది. ఆ తర్వాత 'తేరే దో నైనా' అనే మ్యూజిక్ వీడియోలో అపరశక్తి ఖురానాతో కలిసి కనిపించింది. 2020లో నెట్‌ఫ్లిక్స్ చిత్రం గిల్టీతో సినీ రంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రంలో అత్యాచార బాధితురాలిగా కనిపించింది. ఆకాంక్ష నటనకు ఉత్తమ సహాయ నటి (మహిళ)గా నామినేషన్ దక్కించుకుంది. తర్వాత 2021 నెట్‌ఫ్లిక్స్ సిరీస్ రేతో తన వెబ్ ప్రపంచంలోకి ప్రవేశించింది. ఈ సిరీస్‌లో హర్షవర్ధన్ కపూర్ సరసన కనిపించింది. ఆమె తదుపరి సంగీత వీడియో 'హమ్ హి హమ్ దే'లో ఆషిమ్ గులాటీతో కలిసి కనిపించింది. ఆ తర్వాత రాజ్‌కుమార్ రావ్, రాధికా ఆప్టే మరియు హుమా ఖురేషీలతో కలిసి 'మోనికా, ఓ మై డార్లింగ్'లో కనిపించింది. ఆకాంక్ష నటించిన రెండవ చిత్రమిది. ఇది విమర్శకులు సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆకాంక్ష నటిగా షైన్ అయింది. తనకంటూ ఓ ప్రత్యేక మార్గాన్ని ఏర్పరుచుకునేందుకు ఆకాంక్ష హార్డ్ వర్క్ చేస్తోంది. ప్రస్తుతం మాయా వన్ అనే చిత్రంలో నటిస్తోంది.

# మడత పడిన నడుముతో దేవియాని గ్లామర్ ట్రీట్




ఎక్స్‌ప్రెషన్స్, ఆ అటిట్యూడ్ చూస్తుంటే అందరి ఫోకస్ ఆమెపై యూ టర్న్ తీసుకోకుండా ఉండదు. ఇన్‌స్టాగ్రామ్‌లో సోషల్ మీడియా యాక్టివిటీతో ఎప్పుడూ ఫోకస్‌లో ఉండే నార్త్ బ్యూటీ దేవియాని శర్మ తాజాగా షేర్ చేసిన గ్లామర్ ఫొటోలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. ఆమె ఫాలోవర్లకు అందించిన ఈ లుక్‌కు నెటిజన్లు ఫిదా అయిపోయారు. ఎర్ర రంగు బ్లౌజ్, ఆకుపచ్చ చీరతో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన దేవియాని తన గ్లామర్ లుక్‌తో ఫోటోషూట్‌కి కొత్త డెఫినిషన్ ఇచ్చింది. ఎక్స్‌ప్రెషన్స్, ఆ అటిట్యూడ్ చూస్తుంటే అందరి ఫోకస్ ఆమెపై యూ టర్న్ తీసుకోకుండా ఉండదు. ఫొటోలు చూసిన నెటిజన్లు 'ఫైర్' కామెంట్లతో ఫుల్ ట్రెండ్‌లోకి తీసుకొస్తున్నారు. దేవియాని శర్మ మొదటగా యూట్యూబ్ వెబ్ సిరీస్‌లతో వెలుగులోకి వచ్చారు. 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్', వంటి వెబ్ కంటెంట్ ప్రాజెక్టుల్లో ఆమె నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా సైతాన్ సిరీస్‌లో ఆమె పోషించిన ఇంటెన్స్ క్యారెక్టర్‌కు సంబంధించిన లుక్స్, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దేవియాని ఏ పాత్రలోనైనా ఒదిగిపోయే నైపుణ్యం ఉండటంతో ఆమెకు వరుసగా అవకాశాలు వచ్చాయి. వెబ్ సిరీస్‌లతో పాటు సినిమాలపై కూడా ఫోకస్ పెడుతున్న దేవియాని త్వరలో టాలీవుడ్‌లో ఒక మంచి పాత్రతో రాబోతున్నట్లు సమాచారం. తెలుగులో ఆమెకు పూర్తి స్థాయి గ్లామర్ రోల్స్‌తో పాటు పెర్ఫార్మెన్స్‌ను హైలైట్ చేసే పాత్రలపై ఆసక్తి ఉంది. ఈ మధ్య వచ్చిన ఓ ఫోటోషూట్‌లో కూడా ఆమె స్టన్నింగ్‌గా కనిపించడం చూస్తే, స్టార్ ఇమేజ్ కోసం ఎలా ప్లాన్ చేసుకుంటున్నదో అర్థమవుతోంది. ఇటీవల ఆమె పుట్టినరోజు సందర్భంగా చాలా సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియాలో విషెస్ చెబుతుండగా, ఆమె పోస్ట్ చేసిన స్టైలిష్ లుక్స్‌కి హృదయాలే పెట్టేశారు. దేవియాని సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే బ్యూటీ. ఇన్‌స్టా రీల్స్, ట్రెండింగ్ ఫోటోషూట్లతో ఫాలోయింగ్ పెంచుకుంటూ కెరీర్ పరంగానూ ముందుకు సాగుతోంది.

# ఆలయంలో జరిగే ప్రోగ్రాంకు వచ్చి స్పృహ తప్పిన హీరో విశాల్

తాజాగా ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల్ ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అసలేమైంది? అన్న వివరాల్లోకి వెళితే. తమిళ సినీ నటుడు విశాల్ అనారోగ్యానికి గురయ్యారు. దేవాలయంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఉన్నట్లుండి ఒక్కసారిగా వేదికపై స్పృహ తప్పి పడిపోవటంతో కలకలం రేగింది. ఆ వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. ఇటీవల కాలంలో ఆయన ఆరోగ్యంపై పలు వార్తలు వస్తున్న వేళ.. తాజాగా ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల్ ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అసలేమైంది? అన్న వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని విల్లుపురం జిల్లాలోని కూవాగంలోని కూత్తాండవర్ ఆలయంలో చిత్తిరై వేడుకల్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ట్రాన్స్ జెండర్లకు మిస్ కూవాగం 2025 పోటీల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో విశాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా ఒక్కసారిగా విశాల్ స్పృహ తప్పి పడిపోయారు. దీంతో అక్కడి వారిలో ఆందోళన నెలకొంది. వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. అయితే.. ఆయన ఆహారం తినకపోవటం వల్లే నీరసానికి గురై.. స్పృహ తప్పినట్లుగా తెలుస్తోంది. అక్కడే ఉన్న తమిళనాడు మాజీ మంత్రి పొన్ముడి ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేశారు. దీంతో విశాల్ కోలుకున్నారు. అరగంట తర్వాత తిరిగి కార్యక్రమానికి హాజరు కావటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల మదగజ రాజా సినిమా ప్రమోషన్స్ లోనూ విశాల్ నీరసంగా కనిపించటం.. దానికి సంబంధించిన వీడియోలు తెగ వైరల్ అయ్యాయి.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# పవన్ హీరోయిన్‌ని ఇలా ఎప్పుడూ చూడలేదు!



'కహోనా ప్యార్ హై'తో దేశవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న అమీషా పటేల్ ఆ తర్వాత 'బద్రి' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది 'కహోనా ప్యార్ హై'తో దేశవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న అమీషా పటేల్ ఆ తర్వాత 'బద్రి' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది. హృతిక్ సరసన బాలీవుడ్ లో, పవన్ కల్యాణ్ సరసన టాలీవుడ్ లో పరిచయమైంది. అటుపై తెలుగులో పలువురు అగ్ర హీరోల సరసన నటించింది ఈ బ్యూటీ. పవన్ కల్యాణ్, మహేష్, బాలకృష్ణ లాంటి టాప్ స్టార్ల సరసన నటించింది. కానీ దురదృష్టవశాత్తూ ఇక్కడ ఆశించిన స్థాయికి ఎదగలేదు. అటుపై బాలీవుడ్ లో వరుస చిత్రాలతో బిజీ అయింది. అక్కడ అగ్ర హీరోల సరసన అమీషా నటించింది. కెరీర్ ఆద్యంతం తనదైన అందం, హొయలుతో ఉర్రూతలూగించిన అమీషా పటేల్ కి ఇటీవల ఏజ్ సమస్యలు ఎక్కువయ్యాయి. వయసు పెరుగుతుంటే పోటీ ప్రపంచంలో అమీషాకు అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లో గేమ్ ఛేంజర్ గా మారేందుకు తనవంతు ప్రయత్నాలను విడిచిపెట్టడం లేదు. పదే పదే బోల్డ్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా అమీషా షేర్ చేసిన ఫోటోషూట్ దీనికి సింబాలిక్ అంటూ నెటిజనులు కామెంట్లు చేస్తున్నారు. బుట్టబొమ్మ ఆన్ సెట్స్ కి సోలోగా..సింగిల్ గానా? ఇటీవలే గదర్ 2తో భారీ బ్లాక్ బస్టర్ అందుకున్న అమీషా నిరంతరం తన సోషల్ హ్యాండిల్‌లో బోల్డ్ ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com